ఏప్రిల్ నుంచి ఉద్యోగుల బిల్లులు చెల్లిస్తాం

- నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లు విడుదల చేస్తాం
- బకాయిల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదు
- ఉద్యోగ జెఎసి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఏప్రిల్ నుంచి ఉద్యోగులను పెండింగ్ బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తామని చెప్పారు. నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు విడుదల చేస్తామని వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ ఉద్యోగ జెఎసి నేతలతో భట్టి విక్రమార్క సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని అన్నారు. దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను అర్థం చేసుకుని ఒక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన రూ.ఐదు వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచిందని వివరించారు. గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని చెప్పారు. పాత, కొత్త పెండింగ్ బిల్లులు రూ.పది వేల కోట్లు తమ ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. మరో రూ.ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయని అన్నారు. ఏప్రిల్ నుంచి ఎలాంటి బకాయిల్లేకుండా చూస్తామని చెప్పారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న రూ.ఎనిమిది వేల కోట్ల పాత బకాయిలను రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రతినెల రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు విడుదల చేస్తామన్నారు. గత పదేండ్లు పాలించిన వారి సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున జీతభత్యాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని వివరించారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరలో విడుదల చేస్తామన్నారు. ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలను పరిష్కరించడానికి మంత్రివర్గ ఉపసంఘం సభ్యులున్నారని, ఆ సమస్యలు కూడా త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వివరించారు. తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, నేతలు చావ రవి, ఎ వెంకట్, ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, పుల్గం దామోదర్‌రెడ్డి, జి సదానందంగౌడ్, వంగ రవీందర్‌రెడ్డి, బ్యాగరి శ్యామ్, పి మధుసూదన్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, ఎన్ తిరుపతి, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, ఎం అంజిరెడ్డి, మణిపాల్‌రెడ్డి, పోచయ్య, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఏ వారసులకు విఎల్‌వొ పోస్టుల్లో అవకాశమివ్వాలి

సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 61 ఏళ్లు దాటిన విఆర్ఏ వారసులకు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమిస్తున్న విలేజ్ లెవెల్ ఆఫీసర్ (విఎల్‌ఒ) పోస్టుల్లో అవకాశం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి 10,950 విలేజ్ లెవెల్ అధికారుల (విఎల్‌ఒ)ను నియమించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ నియామకాల్లో అతి తక్కువ వేతనాలతో తరతరాలుగా ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందిస్తూ 61 ఏండ్లు పైబడిన విఆర్ఏ వారసులకూ అవకాశం కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 61 ఏండ్లు పైబడిన విఆర్ఏ వారసులకు ఉద్యోగాలిస్తామని, 81, 85 జిఒలను 2023, జులై, ఆగస్టులో బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిందని గుర్తు చేశారు. జీవోలు వచ్చి రెండేండ్లు కావస్తున్నా 61 ఏళ్లు దాటిన 3,797 మంది విఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వకుండా కాలయాపన జరిగిందని తెలిపారు. తండ్రి ఉద్యోగం కొడుకుకు తప్పకుండా వస్తుందనే ఆశతో, ఆస్థి పంపకాల్లో భాగంగా ఉన్న కొద్దిపాటి భూమి అన్నదమ్ములకు ఇచ్చారని పేర్కొన్నారు. భూమి లేనివారు లక్షలాది రూపాయలు వడ్డీలకు అప్పులు తెచ్చి ఇచ్చారని తెలిపారు.

ప్రస్తుతం అప్పులు కట్టలేక, ఉద్యోగాలు రాక ఆర్థిక ఇబ్బందులతో, మనోవేదనతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం వారసులకు ఉద్యోగాలిస్తామని తెచ్చిన జిఒను ప్రభుత్వాలు అమలు చేయకపోవడమేనని తెలిపారు. వారి సమస్యల అధ్యయనం కోసం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా కమిటీని నియమించి ఏడాది దాటినా సమస్య నేటికీ పరష్కారం కాలేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వారిపట్ల మానవతా దృక్పథంతో స్పందించి 61 ఏళ్లు పైబడిన విఆర్ఏ వారసులను ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమంచబోయే విఎల్‌ఒ ఉద్యోగాల్లో అవకాశమివ్వాలని కోరారు.

కేంద్రంపై పోరు

- ప్రజాభవన్‌లో నేడు అన్ని పార్టీల ఎంపిలతో సిఎం భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపిలతో సమావేశం నిర్వహించాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలపై చర్చించనున్నట్టు సమాచారం. బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు గురువారం నాటి క్యాబినెట్‌లో ఆమోదముద్ర పడిన విషయం తెలిసిందే. త్వరలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లుకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించాలని సర్కార్ నిర్ణయించింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో మార్పు చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుకునే అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరనుంది. పెండింగ్ సమస్యలతో పాటు రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం మోడీ సర్కార్‌పై ఒత్తిడి పెంచేందుకు వీలుగా రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపిలు పార్లమెంట్‌లో ఒత్తిడి తేవాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించనుంది. ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపిలందరికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.

చిన్నారి శ్రీవిద్య చదువుకు అండగా కెటిఆర్

- రెండు సంవత్సరాల ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చిన్నారి శ్రీవిద్య మళ్లీ స్కూలు గడప తొక్కింది. తనకు ఎంతో ఇష్టమైన పుస్తకాలతో మళ్లీ స్నేహం చేస్తుంది. ఆమె కలలకు కేటీఆర్ రెక్కలు తొడగడంతో మళ్లీ బడిబాట పట్టింది. సరైన పత్రాలు లేకపోవడం హైదరాబాద్ సనత్ నగర్ దాసారం బస్తీకి చెందిన మల్లెల శ్రీవిద్య అడ్మిషన్ ను స్కూల్ యాజమాన్యం రద్దు చేసింది. బాగా చదువుకోవాలని ఆశపడ్డ శ్రీవిద్యకు ఆధార్ రూపంలో ఎదురైన సమస్య గురించి పత్రికలో వచ్చిన వార్తకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన కార్యాలయ సిబ్బందిని శ్రీవిద్య ఇంటికి పంపించి తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఆధార్, బర్త్ సర్టిఫికేట్‌ఇప్పించడంలో సహాయం చేస్తామన్నారు. శ్రీవిద్య తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న కెటిఆర్, ఆమె చదువు ఆగిపోవద్దనే ఉద్దేశంతో రెండు సంవత్సరాల స్కూల్ ఫీజును చెల్లించారు. భవిష్యత్తులో శ్రీవిద్య చదువుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని చెప్పారు.

రజక వృత్తిదారులకు అధునాతన లాండ్రీలు

- కేలండర్ ఆవిష్కరణలో మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజక వృత్తిదారులకు అధునాతన లాండ్రీలను ఏర్పాటు చేస్తామని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో రజక వృత్తిదారుల క్యాలెండర్‌ను ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రజక వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నదని తెలిపారు. రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలతో పాటు ఉచిత విద్యుత్తు పథకం బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, విద్యుత్ అధికారుల వేధింపులను ఆపాలని ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాబోయే బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వృత్తి ఆధునీకరణ, ఉపాధి కల్పనకోసం రజక ఫెడరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను రూపొందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, ఉపాధ్యక్షులు సి మల్లేష్, సహాయ కార్యదర్శి మరియాల గోపాల్ పాల్గొన్నారు.

వ్యవసాయ భూమి కార్పొరేట్ కంపెనీల వశం

- గ్రామీణ పేదలు నయా బానిసలుగా మారే ప్రమాదం
- మేలో గ్రామీణ సమ్మె : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని వ్యవసాయ భూమి క్రమంగా కార్పొరేట్ కంపెనీల వశమవుతోందని, దాని ఫలితంగా గ్రామీణ పేదలు నయా బానిసలుగా మారే ప్రమాదం పొంచి ఉందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ హెచ్చరించారు. ఉపాధి, భూమి, ఆహారభద్రత, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం మే నెలలో దేశవ్యాప్తంగా గ్రామీణ సమ్మె చేయనున్నట్టు ప్రకటించారు. దాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు, కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నాటక రాష్ట్రంలోని కొప్పల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జరిగింది. అందులో వెంకట్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులు కూడా నయా బానిసలుగా మారాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలన్ మస్క్ కంపెనీకి దేశంలో అవకాశం ఇవ్వటం ద్వారా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు మరింత దోచుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించిందని విమర్శించారు. తన సంస్థలోని లక్షలాది మంది ఉద్యోగులను తీసేసిన మస్క్ ఇక్కడకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పడమంటే ప్రజల మొఖాలకు ముసుగు వేయటమేనన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటే అదానీ, అంబానీ, కార్పొరేట్లు- హిందూత్వ శక్తుల పాలన అని విమర్శించారు. గ్రామాల్లో ఉపాధి హామీకి నిధులివ్వకుండా, భూపంపిణీ చేయకుండా ప్రజల వద్దకు డబ్బు ఎలా వస్తుంది? డబ్బు లేకుండా కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుంది? కొనుగోలు లేకుండా పరిశ్రమలు నడుస్తాయా? ఉపాధి ఎలా పెరుగుతుంది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధి బూటకమనీ, దాని పేరుతో భూముల కబ్జా జరుగుతున్నదనీ, అందుకే భూసేకరణలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కోర్టులు కూడా అందుకు వంత పాడటం దురదృష్టమన్నారు. భూ బ్యాంకుల పేరిట పేదలు సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నదని విమర్శించారు. దేశంలో దళితులకు, ఆదివాసీలకు, మహిళలకు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

PREMIER ENERGIES LIMITED

(CIN) : L40106TG1995PLC019909
Regd office: Plot No. 8/B/1 and 8/B/2, E-City, Raviryala Village, Maheshwaram Mandal, Rangareddy District, Telangana - 501359. www.premierenergies.com,
Tel: + 91 9030994222, E-mail: investors@premierenergies.com

పోస్టల్ బ్యాలెట్ ప్రకటన

కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 మరియు 110నిబంధనల మరియు ఇతర వర్తించే నిబంధనల ప్రకారం, సవరించిన (చట్టం) ప్రకారం, కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 యొక్క రూల్స్ 20 మరియు 22 మరియుసెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్‌ఆబ్లిగేషన్స్ అండ్‌డిస్క్లోజర్ రిక్వైర్మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 ('లిస్టింగ్ రెగ్యులేషన్స్'), జనరల్ మీటింగ్‌లపైసెక్రటేరియల్ స్టాండర్డ్-2, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా ('ఎస్ఎస్-2') జారీచేసింది, సవరించిన విధంగా మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ('ఎంసిఏ') సూచించిన అవసరాలకు అనుగుణంగా సాధారణ సమావేశాలను నిర్వహించడం/ ఇ-ఓటింగ్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించడం కోసం ఏప్రిల్ 8,2020, ఏప్రిల్ 13, 2020, మే5, 2020 తేదీనాటి జనరల్ సర్క్యులర్స్ చూడండి మరియు తాజాగా జనరల్ సర్క్యులర్ నెం.09/2024 తేదీ.సెప్టెంబర్ 19, 2024 (సమిష్టిగా "ఎంసిఏ సర్క్యులర్లు"అని పిలుస్తారు), ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే ఓటు వేయడం ద్వారాపోస్టల్ బ్యాలెట్ ద్వారా సాధారణ / ప్రత్యేక తీర్మానాలను ఆమోదించడం ద్వారా ఇక్కడ పేర్కొన్న ప్రత్యేక వ్యాపారాన్ని నిర్వహించడానికి ('రిమోట్ ఇ-ఓటింగ్'), ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ("కంపెనీ") సభ్యుల ఆమోదంతో, 03 మార్చి,2025 తేదీ పోస్టల్ బ్యాలెట్ నోటీసులో పేర్కొన్న విధంగా కింది వ్యాపార అంశాల కోసం రిమోట్ ఇ-ఓటింగ్(''ఇ-ఓటింగ్'') ద్వారా కింది ప్రత్యేక తీర్మానాలు/సాధారణ తీర్మానం ప్రక్రియ కోసం కోరబడుతుంది.

క్ర.సం.	తీర్మానం వివరణ
1	శ్రీమతి రేవతి రోహిణి బురగడ్డ (డిఐఎన్: 08114119) వారిని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించబడిన హోల్-టైమ్ డైరెక్టర్‌గా తిరిగినియమించడం – **ప్రత్యేక తీర్మానం**
2	శ్రీ సుధీర్ మూల (డిఐఎన్: 02185026) వారిని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించబడిన హోల్-టైమ్ డైరెక్టర్‌గా నియమించడం– **ప్రత్యేక తీర్మానం**
3	కంపెనీ స్వతంత్ర డైరెక్టర్‌గా శ్రీ ఉదయ్ పిలాని సుధీర్ (డిఐఎన్: 06572889) పునఃనియామకం– **ప్రత్యేక తీర్మానం**
4	ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ స్కీమ్ 2021 (PEL ESOP 2021") యొక్క ధృవీకరణను ఆమోదించడానికి– **ప్రత్యేక తీర్మానం**
5	ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్-ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ స్కీమ్ 2025ఆమోదించడానికి– **ప్రత్యేక తీర్మానం**
6	ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్-ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ స్కీమ్ 2025ను దాని అసోసియేట్ మరియు అనుబంధ కంపెనీల అర్హత కలిగిన ఉద్యోగులకు విస్తరించడానికి – **ప్రత్యేక తీర్మానం**
7	ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ – ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ స్కీమ్ 2025 అమలు కోసం కంపెనీ ఈక్విటీ షేర్లను జారీ చేయడం మరియు కేటాయించడం ద్వారా లేదా సెకండరీ మార్కెట్ నుండి లేదా రెండింటి ద్వారా కంపెనీ యొక్క ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడం లేదా కొనుగోలు చేయడం ఆమోదించడం– – **ప్రత్యేక తీర్మానం**
8	ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ – ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ స్కీమ్ 2025 మరియు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ – ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ స్కీమ్ 2021 అమలు కోసం ట్రస్ట్ / ట్రస్టీలు తమ సొంత వాటాలను కొనుగోలు చేయడానికి కంపెనీ నిధుల కేటాయింపును ఆమోదించడం– **ప్రత్యేక తీర్మానం**
9	కంపెనీ అనుబంధ సంస్థల మెటీరియల్ సంబంధిత పార్టీ లావాదేవీ(లు) ఆమోదం – **సాధారణ తీర్మానం**
10.	ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న విధంగా వస్తువుల పరంగా వైవిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఆమోదించడానికి– **ప్రత్యేక తీర్మానం**

పైన పేర్కొన్న ఎంసిఏ సర్క్యులర్‌లకు అనుగుణంగా, సోమవారం, 3 మార్చి 2025 ('కటాఫ్ తేదీ') నాటికి డిపాజిటరీలు /కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆర్‌టిఏ)-కంపెనీ రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ ('ఆర్‌టిఏ') నుండి స్వీకరించబడిన సభ్యుల రిజిస్టర్ /బెనిఫిషియల్ ఓనర్స్ జాబితాలో పేర్లు ఉన్న కంపెనీ సభ్యులందరికీ మరియు కంపెనీ / ఆర్‌టిఏ/ డిపాజిటరీలలో ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేయబడిన వారికి కంపెనీ మార్చి 07, 2025న ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే వివరణాత్మక ప్రకటనతో పాటు పోస్టల్ బ్యాలెట్ నోటీసును పంపడాన్ని పూర్తిచేసింది.

ఈ నోటీసు కంపెనీ వెబ్‌సైట్: www.premierenergies.com లో, బిఎస్ఇ లిమిటెడ్ ('బిఎస్ఇ') వెబ్‌సైట్‌లోని సంబంధిత విభాగం www.bseindia.com మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (''ఎన్ఎస్ఇ'') www.nseindia.com లో అందుబాటులో ఉంటుంది.

లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని రూల్స్ రెగ్యులేషన్ 44 మరియు ఎంఏసిన సర్క్యులర్లు మరియుఎస్ఎస్-2 తో చదవబడిన చట్టంలోని సెక్షన్ 108 మరియు 110 ప్రకారం, కంపెనీ తన సభ్యులకు రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని మాత్రమే అందించిందని, తద్వారా వారు పోస్టల్ బ్యాలెట్ ఫారమ్ యొక్క భౌతికకాపీని సమర్పించడానికి బదులుగా ఎలక్ట్రానిక్‌గా తమ ఓటు వేయడానికి వీలు కల్పిస్తుందని తదుపరిగా తెలియజేయబడుతున్నది. దీని ప్రకారం, నోటీసు యొక్క భౌతికకాపీని పోస్టల్ బ్యాలెట్ ఫారమ్ మరియు ప్రీ-పెయిడ్ బిజినెస్ రిప్లై ఎన్వలప్‌తో పాటు సభ్యులకు ఈ పోస్టల్ బ్యాలెట్ కోసం పంపబడదు. సభ్యుల సమ్మతి లేదా అసమ్మతిని తెలియజేయడం రిమోట్ ఇ-ఓటింగ్ సిస్టమ్ ద్వారా మాత్రమే జరుగుతుంది. కంపెనీ తన సభ్యులకు రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని అందించే ఉద్దేశ్యంతో మెస్సస్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆర్టీఏ) సేవలను ఉపయోగించుకుంది.

ఈ-ఓటింగ్ సౌకర్యం తదుపరి కాలంలో అందుబాటులో ఉంటుంది.

ఇ-ఓటింగ్ వ్యవధి ప్రారంభం	**శనివారం, 8 మార్చి, 2025 ఉ.9.00 గంటల నుండి (ఐఎస్టీ)**
ఇ-ఓటింగ్ వ్యవధి ముగింపు	**ఆదివారం, 6 ఏప్రిల్, 2025 సా.5.00 గంటల వరకు (ఐఎస్టీ)**
ఓటు వేయడానికి అర్హత కోసం కటాఫ్ తేదీ	**సోమవారం, 3 మార్చి, 2025**

పోస్టల్ బ్యాలెట్‌ను నిష్పాక్షికంగా మరియు పారదర్శకంగా పరిశీలించడానికి స్క్రూటినైజర్‌గా శ్రీ మోహిత్ గుర్జాం, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీ (సిఓపి నెం.18644), పిఎస్ రావు& అసోసియేట్స్, కంపెనీ సెక్రటరీ సంస్థ భాగస్వామి వారిని కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నియమించారు.

పోలైన ఓట్ల పరిశీలన పూర్తయిన తర్వాత, స్క్రూటినైజర్ రిమోట్ ఇ-ఓటింగ్ ముగిసిన తేదీ నుండి రెండు పని రోజులలోపు పోస్టల్ బ్యాలెట్ ఫలితాలపై తన నివేదికను కంపెనీ చైర్‌పర్సన్ లేదా పూర్తి-కాల డైరెక్టర్ లేదా చైర్‌పర్సన్ అధికారం ఇచ్చిన మరే ఇతర వ్యక్తికి సమర్పిస్తారు మరియు అది కంపెనీ వెబ్‌సైట్ www.premierenergies.com లో అందుబాటులో ఉంటుంది. ఫలితాలను కంపెనీ షేర్లు జాబితా చేయబడిన స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కూడా వెంటనే పంపుతారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవసరమైన మెజారిటీతో తీర్మానాలు ఆమోదించబడితే, రిమోట్ ఇ-ఓటింగ్ కోసం పేర్కొన్న చివరి తేదీ, అనగా ఆదివారం ఏప్రిల్ 6, 2025న ఆమోదించబడినట్లు పరిగణించబడుతుంది.

ఇ-ఓటింగ్‌కు సంబంధించి ఏవైనా ప్రశ్నలు లేదా సమస్యలు ఉంటే, సభ్యులు https://evoting.kfintech.com యొక్క డౌన్‌లోడ్ విభాగంలో అందుబాటులో ఉన్న హెల్ప్ & తరచుగా అడిగే ప్రశ్నలు (ఎఫ్ఏక్యూలు) మరియు ఇ-ఓటింగ్ యూజర్ మాన్యువల్‌ను చూడవచ్చు లేదా einward.ris@kfintech.com కు ఇ-మెయిల్ రాయవచ్చు లేదా టోల్ ఫ్రీ నెం.18003094001 పై కెఫిన్‌టెక్ వారికి కాల్ చేయవచ్చు.

By Order of the Board
For Premier Energies Limited
Sd/-
Ravella Sreenivasa Rao
Company Secretary and Compliance Officer

Place: Hyderabad
Date : 07-03-2025

బడ్జెట్‌లో యువజనరంగానికి అధిక నిధులు కేటాయించాలి

- యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2025-26 వార్షిక బడ్జెట్‌లో యువజన రంగానికి అధిక నిధులను కేటాయించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిరుద్యోగ భృతి గురించి ఊసెత్తడం లేదని విమర్శించారు. రాబోయే వార్షిక బడ్జెట్‌లో నిరుద్యోగ భృతిని అమలు చేసేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. యూత్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. యువతకు స్వయం ఉపాధి రుణాలిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాక నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో జాబ్ క్యాలండర్‌ను ప్రకటించినా ఇప్పటి వరకు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ నియామకాలను చేపట్టాలని తెలిపారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ భృతి రూ నాలుగు వేలు ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు డి తిరుపతి, గడ్డం వెంకటేష్, జావెద్, శివవర్మ, క్రిష్ణనాయక్, జె కార్తీక్ పాల్గొన్నారు.



సమగ్ర సర్వేపై స్వతంత్ర కమిటీ

- చైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర కుటుంబ సర్వేపై అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సర్వేలోని సమాచారాన్ని విశ్లేషణ చేసి పొరపాట్లకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని భట్టి తెలిపారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ శాంత సిన్హా ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని తెలిపారు. ఈ నిపుణుల కమిటీ సర్వేపై అధ్యయనం చేసి నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని సూచించారు. సామాజిక న్యాయానికి పునాది వేయాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సర్వే నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పారదర్శకంగా సర్వే జరిపించినట్టు తెలిపారు. దానిపై వస్తున్న విమర్శల్లో నిజమెంతో సామాజిక వేత్తల అధ్యయనంతో తేలిపోనుందని అన్నారు. సమావేశంలో ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

ఫారం PAS-1

[Pursuant to section 27(1) and rule7(2) of Companies (Prospectus and Allotment of Securities) Rules, 2014]

Advertisement giving details of notice of special resolution for varying the terms of any contract referred to in the prospectus or altering the objects for which the prospectus was issued

Name of the Company: Premier Energies Limited

Corporate Identification Number (CIN) – L40106TG1995PLC019909

Registered office address- Plot No. 8/B/1 and 8/B/2,E-City, Maheshwaram Mandal Raviryala Village, Ranga Reddy, Maheshwaram, Telangana, India - 501359

బహిరంగ ప్రకటన

మార్చి 03, 2025 నాటి తీర్మానం ద్వారా, ఆగస్టు 29, 2024 నాటి ప్రాస్పెక్టస్‌లో సూచించిన కాంట్రాక్ట్ నిబంధనలను మార్చాలని బోర్డు ప్రతిపాదించిందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ఈక్విటీ షేర్లకు రూ.450 ధరకు 62909200 ఈక్విటీ షేర్లను జారీ చేయడానికి, రూ.28,304.00 మిలియన్ల ముఖ విలువ కలిగిన 28,709,200 ఈక్విటీ షేర్లను ("ఈక్విటీ షేర్లు")రూ.12,914 మిలియన్లకు ("తాజా ఇష్యూ") విభజించి, కొంతమంది వాటాదారులు ఈక్విటీ షేర్లకు రూ.15,390.00 మిలియన్లకు అమ్మకానికి ఆఫర్ చేస్తారు, మరియు ఉద్యోగుల రిజర్వేషన్ పోర్షన్‌లో బిడ్డింగ్ చేసే అర్హతగల ఉద్యోగులకు ఈక్విటీ షేరుకు రూ.22 తగ్గింపు ఇవ్వబడుతుంది.

చెప్పిన దాని ప్రకారం తీర్మానం ఆమోదించబడిన తర్వాత, ఆ ప్రతిపాదనను ఆమోదించడానికి, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించాలని తదుపరి నోటీసు ఇవ్వబడింది.

సదరు వైవిధ్యం/మార్పుకు సంబంధించిన వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1) కాంట్రాక్టు నిబంధనల వివరాలు మార్చబడతాయి (లేదా మార్చవలసిన ఆబ్జెక్ట్)–

ప్రాస్పెక్టస్‌లో వెల్లడించిన విధంగా, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలోని సీతారాంపూర్‌లోని ఇండస్ట్రియల్ పార్క్‌లోని యుడిఎల్-5 పార్ట్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలోని నాయుడుపేట గ్రామంలోని ఇండస్ట్రియల్ పార్క్‌కు 4 జిడబ్ల్యు సోలార్ పివి సెల్‌లైన్ కోసం ప్రాజెక్ట్ యొక్క స్థానం మార్చబడుతుంది. ప్రతిపాదిత 4 జిడబ్ల్యు సోలార్ మాడ్యూల్ లైన్ అమలు ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న విధంగానే కొనసాగుతుంది.

4జిడబ్ల్యు సెల్ లైన్ కొత్త ప్రదేశంలో ఫ్రీ హోల్డ్ భూమిపై నిర్మించబడుతుంది మరియు ఆ భూమిని ప్రాజెక్ట్ సంస్థ (ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్) కొనుగోలు చేస్తుంది, దీని ద్వారా ఉపయోగించని ఆఫర్ ఆదాయం నుండి సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కేటాయించబడింది.

2) ప్రతిపాదిత వైవిధ్యం/మార్పు యొక్క వివరాలు–

సోలార్ సెల్ లైన్ కొత్త ప్రదేశంలో 269 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూమిలో నిర్మించబడుతుంది మరియు ఆ భూమిని ప్రాజెక్ట్ సంస్థ (ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్) కొనుగోలు చేస్తుంది, ఇది సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కేటాయించిన ఐపిఓ నిధుల నుండి 5 జిడబ్ల్యు సిలికాన్ వేఫర్ తయారీ సౌకర్యం మరియు 4 జిడబ్ల్యు సోలార్ పివి సెల్ తయారీ లైన్‌ను అమలు చేస్తుంది.

3) వైవిధ్యానికి కారణాలు/ సమర్థన–

బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్:

5 జిడబ్ల్యు సిలికాన్ ఇంగోట్ మరియు వేఫర్ తయారీ సౌకర్యంతో పాటు అత్యాధునిక 4 జిడబ్ల్యు ఫోటోవోల్టాయిక్ (పివి) సెల్ తయారీ లైన్‌ను ఏర్పాటు చేయాలని మేము ప్రతిపాదిస్తున్నాము, రెండూ ఒకే స్థలంలో ఉన్నాయి. ఈ వ్యూహాత్మక చొరవ సౌరశక్తి సరఫరా గొలుసు యొక్క రెండు కీలక దశలను ఒకే పైకప్పు క్రిందకు తీసుకురావడం ద్వారా బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌ను ప్రభావితం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది, కార్యాచరణ సామర్థ్యం మరియు ఉత్పత్తి ప్రక్రియలపై ఎక్కువ నియంత్రణను నిర్ధారిస్తుంది.

పివి సెల్ ఉత్పత్తి మరియు సిలికాన్ ఇంగోట్ మరియు వేఫర్ తయారీ సౌకర్యాలను ఒకే చోట సమగ్రపరచడం ద్వారా, మేము సజావుగా మరియు అత్యంత సమర్థవంతమైన కార్యాచరణ వాతావరణాన్ని సృష్టిస్తాము. ఈ సమగ్ర విధానం సరఫరా గొలుసును క్రమబద్ధీకరించడమే కాకుండా బాహ్య సరఫరాదారుల నుండి సోర్సింగ్ పదార్థాలతో సంబంధం ఉన్న లాజిస్టికల్ సంక్లిష్టతలు మరియు రవాణా ఖర్చులను కూడా తగ్గిస్తుంది.

5 జిడబ్ల్యు సిలికాన్ ఇంగోట్ మరియు వేఫర్ సౌకర్యం పివి సెల్ ఉత్పత్తికి అవసరమైన కీలకమైన ముడి పదార్థాల స్థిరమైన మరియు అధిక-నాణ్యత సరఫరాను నిర్ధారిస్తుంది, మూడవ పక్ష సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది

మరియు సరఫరా గొలుసు ప్రమాదాలను తగ్గిస్తుంది. ఇది మెరుగైన నాణ్యత నియంత్రణ, తగ్గిన లీడ్ సమయాలు మరియు మార్కెట్ డిమాండ్‌కు ప్రతిస్పందనగా ఉత్పత్తిని త్వరగా స్కేల్ చేసే సామర్థ్యాన్ని అనుమతిస్తుంది.

పోర్టుకు సమీపంలో సౌకర్యం లభ్యత:

ప్రతిపాదిత సౌకర్యం వ్యూహాత్మకంగా కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో ఉంది. ఇది కంపెనీకి పదార్థాల దిగుమతులపై లాజిస్టిక్ ఖర్చును ఆప్టిమైజ్ చేయడానికి మరియు కంపెనీకి ఎగుమతుల సౌలభ్యాన్ని ఆప్టిమైజ్ చేయడానికి సహాయపడుతుంది, దీని వలన కంపెనీ వ్యాపారంలో పోటీతత్వం కలిగి ఉంటుంది.

వ్యూహాత్మక స్థానం:

కొత్త ప్రాజెక్ట్ భూమి ఆంధ్రప్రదేశ్‌లోని చెన్నై మరియు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ (సిబిఐసి)కి దగ్గరగా ఉంది, ఇవి ప్రధాన వాణిజ్య కేంద్రాలు. ఈ సామీప్యత పెద్ద మార్కెట్లకు మరియు విస్తృత కస్టమర్ స్థావరానికి సులభంగా చేరుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ ప్రాంతం జాతీయ రహదారులు మరియు రైల్వేల ద్వారా మంచి రోడ్డు కనెక్టివిటీని కలిగి ఉంది, ముడి పదార్థాలు మరియు పూర్తయిన వస్తువుల సజావుగా రవాణాను సులభతరం చేస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ / ఆర్థిక ప్రోత్సాహకాలు:

ప్రతిపాదిత తయారీ యూనిట్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నందున, ప్రభుత్వ విధానాలు, ఆర్థిక పరిస్థితులు మరియు ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికలకు లోబడి సబ్సిడీలు, పన్ను ప్రయోజనాలు మొదలైన వాటితో సహాపారిశ్రామిక అభివృద్ధికి వివిధ సబ్సిడీలు, వివిధ ప్రోత్సాహక పథకాలు మరియు సమ్మతి ప్రక్రియల సౌలభ్యానికి దరఖాస్తు చేసుకోగలదు.

4) ప్రతిపాదిత వైవిధ్యం/మార్పు కంపెనీ ఆర్థిక స్థితిపై ప్రభావం:

స్టాంప్ డ్యూటీ మినహా 1621 మిలియన్ల రూపాయల భూమిని స్వాధీనం చేసుకునేందుకు అయ్యే ఖర్చును కంపెనీ ప్రాజెక్ట్ సంస్థ (ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్)కి సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కేటాయించిన ఉపయోగించని ఆఫర్ నిధుల నుండి అందిస్తుంది, ప్రాజెక్ట్ సంస్థ భూమిని స్వాధీనం చేసుకోవడానికి బాహ్య రుణం అవసరం లేదని నిర్ధారిస్తుంది.

గుర్తించబడిన భూమి సాపేక్షంగా చదునుగా ఉంటుంది, విస్తృతమైన భూమి అభివృద్ధి లేదా లెవలింగ్ అవసరాన్ని తగ్గిస్తుంది మరియు పూర్తిగా లోడ్ చేయబడిన ట్రంక్ మౌలిక సదుపాయాలతో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో ఉంది.

ప్రాస్పెక్టస్‌లోని పేజీ నంబర్ 149 మరియు 150లో పేర్కొన్న విధంగా సోలార్ సెల్ మరియు మాడ్యూల్ లైన్‌ల అమలు కోసం కంపెనీ అదే కొటేషన్‌లను ఉపయోగిస్తుంది.

కొత్త ప్రాజెక్ట్‌లో అమలు చేయబడుతున్న మొత్తం ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న విధంగానే ఉంటుంది, భూమిని స్వాధీనం చేసుకోవడానికి అయ్యే మొత్తం తప్ప.

5) కొత్త లక్ష్యాలకు సంబంధించిన ప్రధాన ప్రమాద కారకాలు:

కొత్త ప్రాజెక్ట్ భూమిలో4 జిడబ్ల్యు సోలార్ సెల్ సౌకర్యాన్ని ఏర్పాటుచేయడం వల్ల పెరిగిన వార్షికస్థాపిత సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి తగినంత డిమాండ్ లేనట్లయితే, మా వ్యాపారం, ఆర్థిక పరిస్థితి మరియు కార్యకలాపాల ఫలితాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయి. తగినంత డిమాండ్ ఉన్నప్పటికీ, పెరిగిన వార్షిక స్థాపిత సామర్థ్యాన్ని మేము సమర్థవంతంగా ఉపయోగించుకోగలమని ఎటువంటి హామీ లేదు. మేము అలా చేయడంలో విఫలమైతే, అది ఖర్చులు పెరగడానికి, మార్జిన్లు తగ్గడానికి మరియు మా వ్యాపారం, ఆర్థిక స్థితి ఆదాయాలు, నగదు ప్రవాహం మరియు కార్యకలాపాల ఫలితాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపడానికి దారితీస్తుంది.

ప్రతిపాదిత వైవిధ్యం/మార్పుకు వ్యతిరేకంగా ఓటు వేసిన డైరెక్టర్ల పేర్లు నిల్:

ఆసక్తిగల ఎవరైనా వివరణాత్మక ప్రకటనతోపాటు ప్రత్యేక తీర్మానం కాపీని కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయంలో లేదా దాని కంపెనీసెక్రటరీ శ్రీ రావెల్ల శ్రీనివాసరావు కార్యాలయంలో investors@premierenergies.com వద్ద ఉచితంగా పొందవచ్చు లేదా దాని కాపీ కోసం కంపెనీ వెబ్‌సైట్: www.premierenergies.com ని సందర్శించవచ్చు.

By Order of the Board
For Premier Energies Limited
Sd/-
Ravella Sreenivasa Rao
Company Secretary and Compliance Officer

Date: 07.03.2025
Place: Hyderabad

పేదోళ్ల కడుపుకొట్టి పెద్దోళ్లకు దోచిపెడతారా?

- కార్మికుల కనీస వేతనాలను సవరించాల్సిందే
- అక్కడ మోడీ.. ఇక్కడ రేవంత్ శ్రమజీవులను దోచుకోవటంలో దొందు దొందే
- ధర్నాలో చుక్కా రాములు, పాలడుగు భాస్కర్

ధర్నాలో మాట్లాడుతున్న చుక్కా రాములు, పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెరిగిన ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సిదేనంటూ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని కార్మిక శాఖ కమిషనరేట్ వద్ద సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించి ఫైనల్ జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. .'కార్మికుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం డౌన్ డౌన్, 2024 జనవరి నెలలో ఇచ్చిన డ్రాఫ్ట్ జీవోలను సవరించి కనీస వేతనం పెంచాలి, 2021లో ఐదు రంగాల షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ ఫైనల్ నోటిఫికేషన్లను గెజిట్ చేయాలి, కనీస వేతనాల సలహామండలిలో అన్ని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి,. వూయ్‌వాంట్ జస్టిస్ అంటూ నినదించారు. సర్కార్ స్పందించకపోతే పోరాటం తప్పదంటూ హెచ్చరించారు.

ధర్నానుద్దేశించి చుక్కా రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1.20 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి వర్తించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలను వారి 2006-12 మధ్య సవరించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లయినా నేటికీ వారి వేతనాలు ఎందుకు పెంచలేదో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ సమావేశాలకు, ప్రతిపాదనలకే పరిమితమైందని విమర్శించారు. అడ్వైజరీ బోర్డు నుంచి ప్రతిపాదనలు తీసుకుని ఫైనల్ జీఓలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పాలకుల నిర్లక్ష్యం మూలంగా లక్షలాది మంది కార్మికులు తీవ్రంగా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ద్రవోల్బణం సగటున 6శాతంగా ఉందని తెలిపారు. కార్మికుల అవసరాలు కూడా పెరిగాయన్నారు. ఇతర వినియోగ వస్తువుల అవసరాలు, ఖర్చులు అదనంగా ఉంటున్నాయని చెప్పారు. వీటిని పరిగణలోకి తీసుకు ని 15వ ఐఎల్‌సీ తీర్మానం, ఆక్ర్టాయిడ్ ఫార్ములా, 1992 సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా లెక్కించి వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో 2021 జూన్‌లో 5 రంగాల షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాలు సవరిస్తూ ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ.. యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు.దీన్ని బట్టే పాలకులు ఎవరి పక్షమో అర్థమవుతుందని విమర్శించారు. కనీస వేతనాల జీవోలను సవరించటం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి లోటు లేదనీ, అయినా ప్రభుత్వం కార్మికుల వేతనాల పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కనీస వేతనాల సవరణ విషయంలో తొందరపాటును ప్రదర్శించిందన్నారు. నెల రోజులు తిరగకముందే అన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌కు డ్రాఫ్ట్ జీవోలు జారీ చేసిందన్నారు. గత జీవోలోని బేసిక్, విడిఎ పాయింట్ల రేట్లకు కలిపి కొత్త బేసిక్‌గా నిర్ణయించారని వాపోయారు. దీనివల్ల కార్మికులకు వేతనాలు ఒక్క రూపాయి కూడా పెరగలేదని చెప్పారు. పైగా గత ప్రభుత్వం పెంచిన వేతనం కన్నా తక్కువ నిర్ణయించటమేంటని ప్రశ్నించారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకత్వంతో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ చర్చలు జరిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి జె వెంకటేశ్, ఎం వెంకటేష్, కె ఈశ్వర్‌రావు, జె చంద్రశేఖర్, జె కుమారస్వామి, జి శ్రీనివాస్, వై సోమన్న తదితరులు పాల్గొన్నారు.

విఎల్‌ఒ పోస్టుల్లో విఆర్‌ఎ వారసులకు అవకాశం కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి విఆర్‌ఎ జెఎసి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నియమించనున్న గ్రామస్థాయి అధికారుల (విఎల్‌ఎ) పోస్టుల్లో విఆర్‌ఎ వారసులకు అవకాశం కల్పించాలని విఆర్‌ఎ జెఎసి కన్వీనర్ వంగూరు రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 61 సంవత్సరాల వయసు పైబడిన విఆర్‌ఎ వారసులకు ఉద్యోగాలిస్తామంటూ 2023లో బిఆర్ఎస్ సర్కార్ జిఒ నెంబర్ 81,85 లను విడుదల చేసిందని గుర్తు చేశారు. వాటి ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 20,555 మంది విఆర్‌ఎలలో 16,758 మందికి ప్రమోషన్లు ఇచ్చి రెవిన్యూ శాఖతో పాటు మున్సిపల్, ఇరిగేషన్, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖల్లో సర్దుబాటు చేసిందని అన్నారు. ఆ జిఒలోనే ప్రకటించిన 3,797 మంది విఆర్‌ఎ వారసులకు ఉద్యోగాలివ్వకుండా అన్యాయం చేశారని పేర్కొన్నారు. అందువల్ల కొత్తగా ఏర్పాటు చేస్తున్న విఎల్‌ఎ నియమకాల్లో అనుభవం, అర్హత ప్రాతిపదికన వారి వారసులందరికీ ఉద్యోగాలివ్వాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

డిప్యుటీ కలెక్టర్‌కు, అధికారిణికి పోస్టు కార్డులును అందిస్తున్న జాగృతి నేతలు

మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి

- ప్రజావాణిలో పోస్టు కార్డుల అందించిన తెలంగాణ జాగృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయంలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి ఒత్తిడి పెంచింది. తెలంగాణ జాగృతి అధ్యక్షులు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రికి రాసిన పది వేల పోస్టు కార్డులను శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యుటీ కలెక్టర్ ర్యాంకు, అధికారిణి పుష్పలతకు తెలంగాణ జాగృతి నాయకులు రంగు నవీన్ ఆచారి, మారిపల్లి మాధవి, రూప్‌సింగ్ అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుతస్తున్నా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని దీన్ని తక్షణమే అమలు చేయడంతో పాటు గత 14 నెలల బకాయిని కలుపుకొని ప్రతీ మహిళకు రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఎమ్మెల్సీ కవిత గారి నాయకత్వంలో ఉద్యమాన్ని ఉదతం చేస్తామని హెచ్చరించారు. హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీకి కూడా పోస్టు కార్డులతో ముంచెత్తుతామని హెచ్చరించారు. ప్రజావాణికి వెళ్లిన వారిలో నాయకులు నరేందర్ యాదవ్, సంతోష్, మారయ్య తదితరులు ఉన్నారు.

బిఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న కెసిఆర్

పార్టీ ముఖ్య నేతలతో కెసిఆర్ సమావేశం

- బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలపై దిశానిర్ధేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కెసిఆర్ శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, బిఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ చర్చించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగసభను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో బిఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం ఉంటుందని సమాచారం. సిల్వర్ జూబ్లీ పేరుతో హైదరాబాద్ లేదా వరంగల్‌లో బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు.

కాగా, ఈ నెల తొమ్మిది నుంచి జరిగే తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో బిఆర్ఎస్ అధినేత పాల్గొంటారని గులాబీ వర్గాలంటున్నాయి. ఎస్ఎల్‌బిసి, కాళేశ్వరం, అప్పుల విషయంలో ప్రభుత్వ తీరును సభ సాక్షిగా ఎండగడతారని అంటున్నారు. 'దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి కెసిఆర్..' అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ చేయడం.. మరోవైపు బిఆర్ఎస్ అధినేత సభకు రావడం లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడం, అనర్హత హెచ్చరికలు కూడా కెసిఆర్ అసెంబ్లీకి వెళ్లేందుకు కారణాలుగా చెబుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కెటిఆర్ హరీశ్ రావు, కవిత, పువ్వాడ అజయ్ కుమార్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, అర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జోగు రామన్న, ఎమ్మెల్సీ కాట మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల కోసం సిఐటియు పోరాడుతోంది

- పాలడుగు భాస్కర్
- మహిళలు, బాలికలకు రక్షణ కోరుతూ ర్యాలీలు

ధర్నాలో పాల్గొన్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవం చరిత్ర స్ఫూర్తితో శ్రామిక మహిళల హక్కుల కోసం సిఐటియు పోరాడుతోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్డు నుంచి ఆర్‌టిసి ఎక్స్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం వచ్చిందంటే పాలక పార్టీల నేతలు ఆ రోజుకే మహిళలను ప్రత్యేకంగా గౌరవించినట్టు శాలువలు, సన్మానాలు, స్వీట్ల పంపకాలు చేస్తున్నారని తెలిపారు. నిజమైన అంతర్జాతీయ మహిళా దినోత్సవం చరిత్ర తెలిసిన వాళ్ళు ఈ రకంగా చేయరన్నారు. మహిళలు తమకు హక్కులు కావాలని పోరాటం చేసిన ఫలితంగానే మహిళా దినోత్సవం వచ్చిందని తెలిపారు. అనేక దేశాల్లో ఓటు హక్కు కోసం పోరాడి మహిళలు సాధించుకున్నారని గుర్తు చేశారు. మహిళలంటే కేవలం వంటింటికే పరిమితం కాదు అనేక రంగాల్లో తాము సైతం ముందుకు వస్తామంటూ పనిచేస్తున్నారని.. సమాన వేతనం, గౌరవం దక్కాలని నేటికీ పోరాటం చేస్తున్నారని చెప్పారు.

మహిళలపై లైంగికదాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం భేటీ బచావో బేటి పడావో అంటుంది తప్ప ఆచరణలో ఎక్కడా మహిళలను రక్షించే చట్టాలను తయారు చేయడం లేదన్నారు. అలాగే, మహిళల రక్షణ చర్యలను తొలగించే లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు పని ప్రదేశాల్లో వేధింపులకు గురవుతున్నారని, మహిళా రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రానున్న కాలంలో శ్రామిక మహిళల హక్కుల కోసం జరిగే పోరాటంలో మహిళలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు నగర శ్రామిక మహిళా కన్వీనర్ కిరణ్మై మాట్లాడుతూ.. మహిళకు కుటుంబం నుంచే గౌరవం ప్రారంభం కావాలన్నారు. మహిళలకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం దక్కాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శి ఎం వెంకటేష్ మాట్లాడుతూ నగరంలో అనేక చోట్ల మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుని వాటిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి, నగర నాయకులు జి.రాములు, కె.అజయ్ బాబు, ఎం.అజయ్ బాబు, టి.మహేందర్, ఎం సత్యనారాయణ, టి.యాదమ్మ, శ్రీనివాస్, వివిధ యూనియన్ల నాయకులు పి.గీత, రమావేని, రాధిక, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలని సిఐటియు మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా నాయకులు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ టౌన్ హాల్ నుంచి క్లాక్ టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ కాజీపేటలో జరిగిన ర్యాలీలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడారు.

జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం కమిటీ ఏర్పాటు

- దేవాదాయ శాఖ సమీక్షలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలనీ, తక్షణ పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఆలయ కమిటీ ఛైర్మెన్ నాగేశ్వర్‌రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసి రాజేంద్రప్రసాద్ యాదవ్, ఆగమా శాస్త్ర పండితులు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. ఆలయ సమగ్ర అభివృద్ధికి తాత్కాలిక పనులు, దీర్ఘ కాలిక పనుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. తాత్కాలిక పనుల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అందుకు బస్సు స్టాండ్స్, రైల్వేస్టేషన్స్, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని సూచించారు. దీర్ఘకాలిక పనుల్లో బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చిల ఏర్పాటు వంటి పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. సూర్యానారాయణమూర్తి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఫినిక్స్ కంపెనీ దౌర్జన్యాలను అడ్డుకోండి

- మహేష్ కుమార్‌గౌడ్‌కు బాధితుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫినిక్స్ కంపెనీ తమపై దౌర్జన్యం చేస్తున్నదని మొబైల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. తమ భూములను ఆ కంపెనీ ఎండి గోపి కృష్ణ, చుక్కలపల్లి సురేష్‌లు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌కు కలిసి వినతిపత్రం సమర్పించారు. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలికి చెందిన 128 మంది మొబైల్ సొసైటీ సభ్యులు ఈ సందర్భంగా ఆయనతో భేటీ అయ్యారు. ఫీనిక్స్ కంపెనీ తప్పుడు పత్రాలను సృష్టించి హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా తమ భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

ఆపరేషన్ 'డి'

- ఎస్ఎల్‌బిసిలో కార్మికుల కోసం అన్వేషణ
- టన్నెల్‌లోకి బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్ క్యాడవర్ శునకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్14వ రోజుకు చేరింది. రెస్క్యూ బృందాలు ఆపరేషన్ 'డి'ని అమలు చేస్తున్నాయి. ఎస్ఎల్‌బిసి సొరంగంలో కార్మికుల అన్వేషణకు శుక్రవారం ఉదయం 7.15 నిమిషాలకు క్యాడ్‌వార్ డాగ్స్ బృందం వెళ్లింది. ఎన్‌డిఆర్ఎఫ్ బృందం 110 మందిని తీసుకొని లోకో ట్రైన్ టన్నెల్‌లోకి వెళ్లింది. పర్యవేక్షణకు డోగ్రా రెజిమెంట్ ఆర్మీ కమాండెంట్ పరీక్షిత్ మెహ్రా, ఎన్‌డిఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డాక్టర్ హర్షిత్ వెళ్లారు. బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌కు చెందిన క్యాడవర్ శునకాలను టన్నెల్ లోపలికి తీసుకెళ్లారు. 15 ఫీట్ల లోతులో ఉన్నా.. మృతదేహాలను గుర్తించడం వీటి ప్రత్యేకత అని అధికారులు చెబుతున్నారు. ఇవి కేరళ వయనాడ్ వరద సమయంలో చిక్కుకున్న వారిని, బురదలో కూరుకున్న మృతదేహాలను పసిగట్టడంలో కీలక పాత్ర పోషించాయి. అక్కడి పరిస్థితులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బాదావత్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

టన్నెల్‌లో ఉబికి వస్తున్న నీరు, పేరుకుపోతున్న బురదతో కార్మికుల ఆనవాళ్ల గుర్తింపు సవాలుగా మారింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రటరీ కర్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ శుక్రవారం టన్నెల్‌ను సందర్శించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ టన్నెల్‌కు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులను వివరించారు. సిస్మాలజీ బృందం పరీక్షల ద్వారా టన్నెల్ లోపల 13.6 కిలో మీటర్ల ప్రాంతంలో టిబిఎంపై రాళ్లు, మట్టి పడి యంత్రం ధ్వంసమైందని అధికారులు తెలిపారు. అందులోనే ఎనిమిది మంది చిక్కుకుపోయి ఉంటారని వివరించారు. సిస్మాలజీ అధికారుల బృందం దోమలపెంట రేంజ్‌లోని తాటిగుండాల సెక్షన్ పరిధిలోని కుడ్డిపెంట ప్రాంతంలో భూ అంతర్గత పరిస్థితిని అంచనా వేసి పరీక్షలు నిర్వహించింది. దీని ఆధారంగా తదుపరి సహాయక చర్యలు కొనసాగించనున్నారు. నలుగురు సభ్యులతో కూడిన అన్వీ రోబోటిక్ నిపుణుల బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. రోబోటిక్ నిపుణులతోపాటు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ కూడా లోపలకు వెళ్లారు. సొరంగంలో కనిపించకుండా పోయిన వారిని క్యాడవర్ శునకాలు గుర్తించే పనిలో ఉన్నాయి. ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్, రోబోటిక్ నిపుణులు టన్నెల్‌లో పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి లెక్క తేలిపోద్ది

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను చూసి ఎగిరెగిరి పడుతున్న బిజెపి లెక్క రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తేలిపోద్దని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఈ ఫలితాలతోనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఇంకా పదేండ్లుగా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాకుండా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు అడ్డుపడుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి నిధులు రాకుండా వారు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి ఎనిమిది స్థానాలను దక్కించుకుందని గుర్తు చేశారు. అంత మాత్రనా బిజెపి అధికారంలోకి వచ్చిందా?తెలంగాణలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ 103 సీట్లలో డిపాజిట్ కోల్పోయిందని తెలిపారు. 2023లో 68 స్థానాల్లో పార్టీకి డిపాజిట్ రాలేదన్నారు. బీఆర్ఎస్ నేతల కేసులను కాపాడుతూ ఆ పార్టీ లబ్ది పొందుతుందని చెప్పారు. బీఆర్ఎస్, బిజెపి లోపాయికారి ఒప్పందం వల్లే ఆ రెండు ఎమ్మెల్సీ స్థానాలను కమలం పార్టీ గెలుచుకుందని విమర్శించారు. బిజెపి ఎంపీలు ఏనాడూ తెలంగాణకు రావాల్సిన నిధుల గురించి మాట్లాడలేదన్నారు. పబ్లిసిటీ కోసం లిక్కర్ డాన్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు.

ప్రయాణికుల భద్రత మా ప్రాధాన్యత

- మెట్రో నిర్మాణంలో అనేక సవాళ్లను అధిగమించాం
- ప్రజలకు గొప్ప రవాణా వ్యవస్థను అందించాం : మెట్రో ఎండి
- ఎన్ఆర్ఎస్‌సి 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెట్రో స్టేషన్లలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన భద్రతా చర్యలు చేపడుతున్నామని హెచ్ఎంఆర్ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఆవిష్కరణలు, శాస్త్రీయమైన ఇంజనీరింగ్ విధానాలతో ముందుకు వెళ్లడం వల్ల హైదరాబాద్ మెట్రో రైల్‌ను ప్రపంచ దేశాల సాంకేతిక పరిజ్ఞానానికి దీటుగా నిలపగలిగామని చెప్పారు. బాలానగర్‌లో ఉన్న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో (ఎన్ఆర్ఎస్‌సి) 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెట్రో రైల్ నిర్మాణాన్ని ఒక ఇంజనీరింగ్ కోణంలోనే కాకుండా, ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న సామాజిక అంశంగా చేపట్టామని తెలిపారు. పిపిపి విధానంలో చేపట్టిన ప్రపంచంలోనే మొట్టమొదటిదైన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో అనేక క్లిష్టతరమైన సవాళ్లను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ, ప్రజలకు ఒక గొప్ప రవాణా వ్యవస్థను అందించగలిగామని చెప్పారు. భద్రత అంటే నిబంధనలకు అనుగుణంగా ఉండటం మాత్రమే కాదు.. బాధ్యత, నిబద్ధతలతో ఈ ప్రాజెక్ట్‌ను మెరుగైన సాంకేతిక

వ్యవస్థతో తీసుకురాగలిగామని చెప్పారు. ప్రాజెక్ట్ ప్రతి దశలో, ప్రమాద విశ్లేషణ, అంచనా వేయడం వల్ల డిజైన్ దశలోనే చాలా ప్రమాదాలు రాకుండా నివారించగలిగామని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రోలో నిర్మాణం సమయంలో కానీ, ఆ తర్వాత కానీ ఇప్పటి వరకు ఒక్క ప్రమాదమూ జరగలేదని, ఇది ఒక రికార్డని అన్నారు. అందువల్ల ప్రతిష్టాత్మకమైన స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో అంతర్జాతీయంగా ఇచ్చే 'రోస్పా గోల్డ్' అవార్డులను వరుసగా మూడేళ్లు పొందామని తెలిపారు. అధునాతమైన సిబిటిసి టెక్నాలజీని మొదటి సారిగా తాము వినియోగించి, దేశంలోని మిగిలిన మెట్రోలకు ఆదర్శవంతంగా నిలవగలిగామని వివరించారు. ఇస్రోకి అనుబంధంగా పని చేస్తున్న ఎన్ఆర్ఎస్‌సి భద్రతా చర్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తూనే, కొత్త ఆవిష్కరణలతో దేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ.. భద్రతతో పాటు, ఉద్యోగులు, సిబ్బంది శ్రేయస్సునూ ఈసారి భద్రతా వారోత్సవాలలో ఇతివృత్తంగా జోడించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. ఎన్ఆర్ఎస్‌సిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి భద్రత, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్‌సి డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమై అన్నదమ్ములు విద్యుద్ఘాతంతో మృతి చెందారు. బైండింగ్ వైరును పంట చుట్టూ ఏర్పాటు చేసి.. 11 కెవి విద్యుత్ వైర్ల ద్వారా నేరుగా కరెంట్ షాక్ ఇద్దామని ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇద్దరూ మరణించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్‌లో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల జగన్ (48), ఎరుకల మల్లేశం అనే అన్నదమ్ములు వారి చెరకు పంటను అడవి పందుల నుంచి కాపాడుకోవడానికి పంట చుట్టూ బైండింగ్ వైరుతో రక్షణ ఏర్పాటు చేశారు. ఆ బైండింగ్ తీగలకు పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ లైన్ ద్వారా కరెంట్ ఇవ్వాలనుకున్నారు. గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో కొండీల ద్వారా కరెంటు ఇవ్వడానికి జగన్ ప్రయత్నిస్తుండగా విద్యుద్ఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి అక్కడికక్కడే మృతి చెందారు. అది గమనించిన మల్లేష్ ఆ వైరును పక్కకు లాగేద్దామని పట్టుకోగానే.. అతడికీ కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

14 ఏళ్ల బన్నీ.. మృతులైన తన మామలతో పొలం దగ్గరికి వెళ్లాడు. ప్రమాదం జరిగిన వెంటనే మామల చేతిలో ఉన్న వైరును పట్టుకోకుండా.. తన వద్ద ఉన్న కర్రతో కొట్టాడు. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అక్కడే ఉన్న గొడ్డలితో కొట్టి రక్షించడానికి ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న వెంటనే చిరాగ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎనిమిది నెలల క్రితం అదే పొలం వద్ద జగన్ తండ్రి నాగన్న పాముకాటుతో మృతిచెందారు. మళ్లీ అక్కడే అన్నదమ్ములిద్దరూ మరణించడంతో వారి కుటుంబంతో పాటు.. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు జగన్‌కు భార్య నలుగురు పిల్లలు, మల్లేష్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

శాఖాపరంగా ఆదుకునేందుకు కృషి : విద్యుత్ శాఖ

పొలం పై నుంచి వెళ్తున్న 11 కెవి విద్యుత్ వైర్లే ప్రమాదానికి కారణమని, మృతుల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. దాంతో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరిపి విద్యుత్‌శాఖ పరంగా వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దాంతో బంధువులు ఆందోళన విరమించారు.

తరలిపోతున్న పెట్టుబడులు

- బిఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనలో పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని బిఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి కక్షపూరిత చర్యలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి, దోపిడీ, విధ్వంస పాలన నడుస్తుంటే, ప్రీమియర్ ఎనర్జీస్, అమర్ రాజ లాంటి కంపెనీలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని చెప్పారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, హైడ్రాతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కుదేలైందన్నారు.